# ఎక్కడ చూసినా అదే చర్చ

◆ జోరుగా సాగుతున్న బెట్టింగులు ◆ గెలుపు ధీమాలో నాయకులు
◆ ఉత్కంఠరేపుతున్న అంచనాలు ◆ నేడే ఎన్నికల ఫలితాలు

ఆత్మకూరు, డిసెంబర్ 2: ఊరువాడ ఎక్కడ చూసినా ఒక్కటే చర్చ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరిని విజయం వరిస్తుందనే.. ఎక్కడ నలుగురు కలిసినా చాలు ఎన్నికల్లో ఎవ్వరు గెలుస్తారనే చర్చనే మొదలుపెడుతున్నారు. పోలింగ్ శాతం మెరుగ్గానే నమోదు కావడంతో అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఎవరికి వారే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. ఎవరికి ఓట్లు పడ్డాయో.. ఎవరు గెలుస్తారోనంటూ ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులే కాకుండా ఓటర్లు కూడా నిత్యం ఇదే చర్చల్లో మునిగి తేలుతున్నారు. ఇదిలా ఉండగా నేటితో ఈ ఉత్కంఠకు తెరపడనుంది. అయినప్పటికీ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఉండే అత్యుత్సాహం ఓటర్లను సైతం ఆసక్తి రేకెత్తిస్తుంది. మెరుగ్గా సాగిన పోలింగ్ శాతం ఎవరికి లాభం చేకూర్చుతుంది, ఎవరికి నష్టం చేకూర్చుతుందంటూ లెక్కలేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా మండలాల ద్వితీయశ్రేణి నాయకులను నియోజకవర్గానికి రప్పించుకొని పోలింగ్ సరళిపై చర్చలు సాగించారు అభ్యర్థులు. వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు అటు అభ్యర్థుల్లో.. ఇటు ఓటర్లలో హై టెన్షన్‌ను రేకెత్తించింది.

***నియోజకవర్గంలో పోలింగ్ సరళి***

మక్తల్ నియోజకవర్గంలో 2, 42,254 ఓటర్లు ఉండగా 1, 86,860 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1, 19,403 పురుషులకు 94, 140 మంది ఓట్లు వేయగా, 1, 22,849 మంది మహిళా ఓటర్లకు 92,719 మంది మహిళలు ఓట్లు వేశారు. మొత్తంగా 77.13 శాతం ఓటింగ్ నమోదయ్యింది. మండల్లాల వారీగా పరిశీలిస్తే ఉట్కూరు మండలంలో 44,272 ఓటర్లకు 33,548 మంది ఓట్లు వేయగా 75. 78 శాతం నమోదైంది. అమరచింత మండలంలో 22,542 ఓట్లకు గాను 18,435 మంది వేయగా 81.78 శాతం నమోదయ్యింది. ఆత్మకూరు మండలంలో 30,563 ఓట్లకు గానూ 24,158 పోల్ కాగా 79.04 శాతం నమోదైంది. కృష్ణ మండలంలో 21,968 ఓట్లకు గానూ 15,740 పోల్ కాగా 71.65 శాతం నమోదైంది. మాగనూరు 19,099కు గాను 15,664 పోల్ కాగా 82.01 శాతం నమోదైంది. మక్తల్ మండలంలో 65,326కు గానూ 48,354 పోల్ కాగా 74.02 శాతం నమోదైంది. నర్వ మండలంలో 27,818కు గానూ 22,363 పోల్ కాగా 80.39 శాతం నమోదైంది. ఇదేకాక ఉమ్మడి జిల్లా పరిధిలో పాత నియోజకవర్గం పరిధిలోనే ఎన్నికలు కొనసాగిన నేపథ్యంలో మరికల్ మండలంలో 9 పోలింగ్ బూత్‌లు, మదనాపురం మండలంలో 4 పోలింగ్ బూత్‌లు మక్తల్ నియోజకవర్గంలోకే వచ్చాయి. మరికల్ మండలంలోని 9 బూత్‌లలో 8,711 ఓట్లకుగానూ 6,915 పోల్‌కాగా 79.38 శాతం నమోదైంది. మదనాపురం మండలంలోని 4 బూత్‌లలో 1955కుగాను 1683 ఓట్లు పోల్‌కాగా 86.09 శాతం నమోదైంది. నియోజకవర్గం మొత్తంగా 284 పోలింగ్‌బూత్‌లలో 2,42,254 ఓట్లకుగాను 1,86,860 పోల్‌కాగా 77.13 శాతం నమోదైంది.


పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు(ఫైల్)

***విజయం ఎవరిని వరిస్తుందో..***

2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనుండడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు సైతం ఆశగా ఎదురుచూస్తున్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే ఆదివారం ఎన్నికల కౌంటింగ్ ఉండడంతో అటు నాయకులతోపాటు ఇటు ప్రజానీకం కూడా ఆసక్తిని కనబరుస్తున్నారు. అన్నిమతాల వారికి ఆదివారం కలిసొచ్చే వారంగా భావిస్తూ ఈ ఆదివారం ఎవరిని విజయలక్ష్మి వరిస్తుందో.. ఎవరికి మొండిచేయి చూపుతుందోనని ఎదురుచూస్తున్నారు. విజయలక్ష్మి తమను ఆశీర్వదించాలని నాయకులు కోటి మొక్కులు మొక్కుతున్నారు. ఇప్పటికే కొంతమంది అభ్యర్థులు పుణ్యస్థలాలు, తీర్థయాత్రలు, యాగాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అభ్యర్థులు, నాయకులు ఇలా ఆధ్యాత్మికం వైపు ఆలోచిస్తుండగా సందెట్లో సడేమియా లాగా కార్యకర్తలు, ప్రజలు బెట్టింగులకు తెరతీశారు. నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారనే కాకుండా రాష్ట్రంలో ప్రాచుర్యం పొందిన పలు స్థానాల్లో ఎవరు గెలుస్తారు, ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి, ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేస్తారనే అంశాలపై జోరుగా బెట్టింగులు సాగిస్తున్నారు. పోలీసులు వీటిపై నిఘా పెట్టినట్లు సమాచారం.

## మంత్రి నిరంజన్‌రెడ్డి గెలువాలని వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ సామ్యానాయక్

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 2: మండలంలోని గట్టుకాడిపల్లిలో వెలిసిన లక్ష్మీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీటీసీ సామ్యానాయక్ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందాలని శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మంత్రి నిరంజన్‌రెడ్డి మండల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మండలానికి సాగునీరు తెచ్చి వేంకటేశ్వర స్వామి పాదాలను కడిగి మొక్కులు తీర్చుకున్నారు. అలుపెరుగని నాయకుడు, మాట ఇస్తే ఎంతటిపనైనా సాధించి ప్రజల మన్ననలు పొందిన నాయకుడు, అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల నాయకుడు, మాట ఇస్తే ఎంతటి పనైనా చేసిచూపించే నాయకుడని పేర్కొన్నారు. అందుకే ప్రజలు ఆయనను ముక్కుసూటి మంత్రి నిరంజన్‌రెడ్డి అని అంటారన్నారు. మండలంలోని ఖిల్లాఘణపురం, మానాజీపేట, ఆగారం, పర్వతాపూర్, వెంకటాంపల్లి, కమాలోద్దీన్‌పూర్, మమిడిమాడ, అల్లమాయపల్లి, అంతయ్యపల్లి, సోళిపూర్, గిరిజనతండాలతోపాటు వివిధ గ్రామాల్లో 25వేల ఎకరాలకు సాగునీరు అందించిన నాయకుడని కొనియాడారు. అందుకే ఆయనకు నీళ్ల నిరంజన్‌రెడ్డి అని కూడా ప్రజలు కొనియాడుతుంటారు. అందుకే ఆయన గెలుపు కోసం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నానని పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థిని పవిత్రను అభినందిస్తున్న ఉపాధ్యాయబృందం

పెబ్బేరు, డిసెంబర్ 2: మండలంలోని సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పవిత్ర రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 4నుంచి 6వతేదీ వరకు నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొనబోతున్నట్లు హెచ్ఎం వెంకటరెడ్డి, పీఈటీ కుర్మయ్య శనివారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న పవిత్ర జిల్లాలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అంత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న స్నేహితులు

గోపాల్‌పేట, డిసెంబర్ 2: మండల కేంద్రానికి చెందిన ఎర్రనాగుల బాలరాజు కొంతకాలం కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మృతుడి కుటుంబాన్ని అతడితోపాటు చదువుకున్న 2005 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.50వేల ఆర్థిసాయం అందజేశారు. మృతుడి కూతురు చారులిల్లీ పేర పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్సే..: ఎంపీపీ

మదనాపురం, డిసెంబర్ 2: తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రిగా కేసీఆర్ సారే ప్రమాణ స్వీకారం చేస్తారని ఎంపీపీ పద్మావతి శనివారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మోసపూరిత మాటలతో ఎగ్జిట్ పోల్స్ అన్నివారికే అనుకూలంగా ఉన్నాయని తప్పుడు సర్వేలు సృష్టిస్తూ ప్రజలను అయోమయంలోకి నెట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, రాష్ట్రంలో గెలిచేది, నిలిచేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం


లతీఫ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

శ్రీరంగాపురం, డిసెంబర్ 2: మండల కేంద్రానికి చెందిన లతీఫ్ ప్రమాదానికి గురై 13ఏండ్లుగా మంచానికే పరిమితమై శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2003లో పదో తరగతి చదువుకున్న మిత్రులందరు కలిసి లతీఫ్ కుటుంబానికి రూ.38,500 ఆర్థికసాయం అందించారు. లతీఫ్ ప్రమాదానికి గురైనప్పటినుంచి తోచిన విధంగా ఆర్థిసాయం అందించిన అందరికీ స్నేహితులందరూ ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీరంగాపూర్ క్రీడాకారిణి ఎంపిక



శ్రీరంగాపురం, డిసెంబర్ 2: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే వనపర్తి జిల్లా మహిళా కబడ్డీ జట్టుకు శ్రీరంగాపూర్ కబడ్డీ క్రీడాకారిణి శ్రీవాణి ఎంపికైంది. ఎంపికైన క్రీడాకారిణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్ గౌడ్, పీఈటీ నిరంజన్‌గౌడ్, ఉపాధ్యాయుల బృందం, గ్రామప్రజాప్రతినిధులు, యువకులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలో శ్రీవాణి ఉత్తమ ప్రతిభ కనబర్చి మరింత ఉన్నతస్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

# ఆత్మకూరులో 72.08 శాతం పోలింగ్

ఆత్మకూరు, డిసెంబర్ 2: ఆత్మకూరు పట్టణంలో 72.08 శాతం పోలింగ్ నమోదైంది ఆత్మకూరు మున్సిపాలిటీగా అవతరించిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న శాసన సభ ఎన్నికలు కాగా 11 పోలింగ్‌బూత్‌లో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. ఏ పోలింగ్ బూత్‌లో ఎంతశాతం పోలింగ్ నమోదైందోనని పరిశీలిస్తే మున్సిపాలిటీ మొత్తంగా 11,194 ఓట్లు ఉండగా 8,069 ఓట్లు పోలయ్యాయి. 72.08 పోలింగ్‌శాతం నమోదైంది. 188 ఖానాపూర్ పోలింగ్‌బూత్‌లో 1,264 ఓటర్లు ఉండగా 985 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 207 ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టేజీ పక్కన ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 1,230 ఓట్లకుగానూ 917 ఓట్లు పోల్ కాగా 74.55 శాతం నమోదైంది. 208 ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టేజీహాల్ వెనకాల ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 1218కుగానూ 922 ఓట్లు పోల్‌కాగా 75.70 శాతం నమోదైంది. 209 హరిజనవాడ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 912 ఓట్లకుగానూ 684 ఓట్లు పోల్‌కాగా 75.00 శాతం నమోదైంది. 210 జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 710కు గానూ 494పోల్‌కాగా 69.58 శాతం నమోదైంది. 211 జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 767కుగానూ 532 పోల్‌కాగా 69.36 శాతం నమోదైంది. 212 జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో 678కుగానూ 479 పోల్‌కాగా 70.65 శాతం నమోదైంది. 213 జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 1009కుగాను 730 పోల్‌కాగా 66.97 శాతం నమోదైంది. 214 ఉర్దూమీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 786కు గాను 541 పోల్‌కాగా 68.83 నమోదైంది. 215 ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనక భాగంలో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 1090కు గాను 730 పోల్‌కాగా 66.97 శాతం నమోదైంది. 216 పాత గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన పీఎస్‌లో 651కుగానూ 429 పోల్‌కాగా 65.90 శాతం నమోదైంది. 217 హరిజనవాడ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పీఎస్‌లో 879కుగాను 654 పోల్‌కాగా 74.40 శాతం నమోదైంది. పట్టణం మొత్తంగా 11,194 ఓట్లు ఉండగా ఇందులో 5,452 పురుషులు, 5,742 మహిళా ఓటర్లు ఉన్నారు. దీనికిగాను 4028 మంది పురుషులు, 4041 మంది మహిళా ఓటర్లు మొత్తంగా 8069 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.


ఆత్మకూరులో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు